క్లుప్తంగా

ఘనంగా జెండా ఉత్సవం



జెండా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని హోమియోపతి కాలేజ్ దగ్గర ఏఎస్ఆర్ నగర్‌లో హజరత్ మహబూబ్ సుభాని దస్తగీర్ సాహెబ్ దర్గా ఉరుసు ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా మెరవణి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దస్తగిరి జెండాను బ్యాండు వాయిద్యాలతో తీసుకొచ్చి దర్గాలో ప్రతిష్ఠించి ప్రార్ధనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నగరానికి చెందిన సయ్యద్ సలావుద్దీన్, దర్గా నిర్వాహకులు మహబూబ్ బాషా, దర్గా కమిటీ ప్రతినిధులు భాష, మస్తాన్, షేక్ సాదక్ వలి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నాం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కర్ణాటక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని ఏపీ రాష్ట్ర మాల మహానాడు జాకట విజయశేఖర్‌వర్గం రాష్ట్ర కార్యదర్శి ఇల్లూరి సురేష్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల కన్నా అత్యున్నత రాజ్యాంగం చాలా గొప్పదని మరోసారి కొనియాడుతున్నామన్నారు. కర్ణాటకలోని కొప్పల్ జిల్లా సెషన్స్ న్యాయస్థానం 98 మందికి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ ప్రివెన్సస్ యాక్టు-1959లో జీవిత ఖైదీలుగా విధిస్తూ ఇచ్చిన సంచలన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. కొప్పలి జిల్లా పోలీసు యంత్రాంగం ఈ కేసులో పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ ఆధారంగా ఇంతమందికి శిక్ష పడిందని, ఈ విషయంలో కర్ణాటక పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అనాథకు అంతిమసంస్కారం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళుతున్న దృశ్యం

కడప అర్బన్: ఖాజీపేట పోలీస్‌స్టేషన్ వారి విన్నప మేరకు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి కడప నగరానికి చెందిన శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి ఆధ్వర్యంలో సేవామూర్తులు ఆదివారం అంత్యక్రియలను నిర్వహించారు. ఈనెల 19న ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లి గ్రామంలో రోడ్డు హైవే దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. కొన ఊపిరితో వున్న అతడనిన 108లో రిమ్స్‌లో చేర్పించారు. రిమ్స్‌లో మృతి చెందాడు. ఖాజీపేట పోలీసువారు చుట్టు పక్కల గ్రామాల వారిని విచారించారు. అతనికి బంధువులుగా ఎవరూ లేకపోవడంతో అంత్యక్రియల కోసం శ్రీ కాశీ విశ్వనాథ సేవాసమితి వారిని సంప్రదించారు. హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవామూర్తులు ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, ఆర్టీసీ రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, రాఘవేంద్ర, టైలర్ రవి, ఎలక్ట్రిషియన్ మధు, ఖాజీపేట పోలీసులు పాల్గొన్నారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక విజిల్స్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు.వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాలను పర్యవేక్షించిన శిల్పారామం పాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

– అదుపు తప్పి కారు బోల్తా

కడప అర్బన్ : కడప నగర శివార్లలో శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో టాటా సుమో కారు వేగం అదుపు కాక బోల్తా పడింది. కారులో వున్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో.. ప్రమాదం త్రుటిలో తప్పింది. రాజంపేట వైపు నుంచి చెన్నూరు వైపు బైపాస్ రోడ్‌లో ఆదివారం రాత్రి వెళుతున్న కారు బోల్తాపడింది. వెంటనే సమీపంలో వున్న కొందరు కారును పైకి లేపారు. కారులో వున్న వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

గంగమ్మతల్లికి విశేష పూజలు

వల్లూరు (చింతకొమ్మదిన్నె) : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లికి ఆదివారం విశేష పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో, పూలమాలలతో విశేష అలంకరణ చేశారు.

అందానికే.. అందం..!

- ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ
- ఫ్లోరల్ జువెలరీలో నైపుణ్యం సాధిస్తున్న విద్యార్థినులు
- స్వయం ఉపాధి లక్ష్యంగా శిక్షణ అందిస్తున్న మహిళా డిగ్రీ కళాశాల

కళాశాలలో ఓవైపు విద్యనభ్యసిస్తూ.. మరో వైపు తమ నైపుణ్యాలకు పదునుపెడుతూ.. మహిళాసాధికారతే లక్ష్యంగా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ముందుకు సాగుతున్నారు. స్థానికంగా లభించే పుష్పాలు, మొక్కలు, ఆకులు తదితర వస్తువులతో అందమైన బొకేలను, పుష్పాలతో ఆభరణాలు, దూపంస్టిక్స్ ఇలా ఉపయోకరమైన వస్తువులుగా మారుస్తూ, స్వయం ఉపాధి దిశగా సాగుతున్నారు.



ఫ్లోరల్ అరేంజ్‌మెంట్, ఫ్లోరల్ జువెలరీ శిక్షణలో విద్యార్థినులు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వృక్షశాస్త్రశాఖ, హార్టికల్చరల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న «ఫ్లోరల్ అరేంజ్‌మెంట్», ఫ్లోరల్ జువెలరీ సర్టిఫికెట్ కోర్సుకు విద్యార్థినుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఫంక్షన్ ఏదైనా, సందర్భం ఏదైనా పుష్పాలంకరణకు ప్రత్యేక అదరణ లభిస్తోంది. పుట్టినరోజు వేడుకలు, పెళ్లిళ్లు, ఫంక్షన్‌లు, అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసే సమయంలో మర్యాదపూర్వకంగా కలిసి బొకేలను అందజేయడం ఆనవాయితీగా మారింది. అదే విధంగా హల్దీ వంటి ఫంక్షన్‌లలో పెళ్లికూతుళ్లకు పుష్పాలతో జువెలరీని తయారు చేయడం ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్ ఈ నేపథ్యంలో పుష్పాలంకరణకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన కళాశాల అధ్యాపకులు ఫ్లోరల్ అరేంజ్‌మెంట్, ఫ్లోరల్ జువెలరీపై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. అక్టోబర్ 1 వతేదీన ప్రారంభమైన ఈ కోర్సును ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా ప్రారంభించారు. కళాశాలలో తృతీయ సంవత్సరం బీఎస్సీ బీజెడ్‌సీ, బీహెచ్‌సీ విద్యార్థులు వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి. సుబ్రమణ్యం మార్గదర్శనంలో శిక్షణ ఉత్సాహంగా సాగుతోంది. దాదాపు శిక్షణ పూర్తికావడంతో విద్యార్థినులు సైతం బొకేల తయారీ, జువెలరీ మేకింగ్, దూపంస్టిక్స్, అగరబత్తీలు తయారీ తదితర అంశాలపై నైపుణ్యాలు సాధించారు.

రాబోయే రోజుల్లో కుటీరపరిశ్రమగా అభివృద్ధి



రానున్న రోజుల్లో పుష్పాలంకరణ, పుష్పాల ఆభరణల తయారీ విధానం కుటీరపరిశ్రమలా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అధ్యాపకుల మార్గదర్శనంలో శిక్షణ చక్కగా సాగుతోంది. రెగ్యులర్ స్టడీస్‌తో పాటు ప్రత్యేక నైపుణ్యాలు అందిపుచ్చుకోవడం సంతోషంగా ఉంది.

\- స్రవంతి, విద్యార్థిని

పూలబొకే తయారీ నేర్చుకున్నాం



మనం ప్రతిరోజూ చూసే పుష్పాలు, ఆకులు, మొక్కలతో పూలబొకే తయారీ చేసే విధానం నేర్చుకున్నాం. ఇంత సులువుగా మనం కూడా బొకేలు తయారీ చేయవచ్చని ఈ శిక్షణ ద్వారా తెలుసుకున్నాం.

\- షారా, విద్యార్థిని

తక్కువ ఖర్చుతో చక్కటి అలంకరణ



మనకు స్థానికంగా లభించే పూలు, ఆకులతో అతి తక్కువ ఖర్చుతో అందమైన బొకేలు తయారుచేసే విధానం శిక్షణలో నేర్చుకున్నాం. వాడిపోయిన పూలతో సైతం సువాసన వెదజల్లే వివిధ రకాల వస్తువులను తయారు చేయగలుగుతున్నాం.

\- లక్ష్మీప్రసన్న, విద్యార్థిని

ఫ్లోరల్ జువెలరీకి ఆదరణ



ప్రస్తుతం ఫంక్షన్‌లలో ఫ్లోరల్ జువెలరీకి ఆదరణ పెరుగుతోంది. సహజంగా లభించే పుష్పాలనే ఆభరణాలుగా ధరించే సంప్రదాయం పెరుగుతోంది. రానున్న రోజుల్లో ఈ జువెలరీకి డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నాం.

\- మోహన, విద్యార్థిని

ఘనంగా చెకుముకి సైన్స్ సంబరాలు



ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న జేవీవీ ప్రతినిధులు

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు మండలాల నుంచి ప్రైవేటు పాఠశాలలకు చెందిన 15 బృందాలు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 22 బృందాలు పోటీలో పాల్గొన్నాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన చెన్నూరు ఎంఈఓ ఎన్.సునీత, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఇవి వారి జ్ఞానాన్ని ఇనుమడింపజేస్తాయన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, సమాజంలో శాస్త్రీయతను కాపాడుకోవాలన్నారు. విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను నేర్చుకోవాలని, మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర నాయకులు ఏడీ దేవదత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి బయన్న, అధ్యక్షులు సమీర్ బాష, సృజన్, ప్రతినిధులు సుబ్బయ్య, పల్లా వెంకటేశ్వర్లు , సునీత, అరుణ, ఎస్తేర్ రాణి, రంగనాయకులు, మధు, శివరాం, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆచార్య ఈశ్వర్‌రెడ్డికి ప్రతిభా పురస్కారం



ఆచార్య ఈశ్వర్‌రెడ్డికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ / వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు ఎస్.ఈశ్వర్‌రెడ్డి కవి సంధ్య ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆదివారం యానాంలోని గీతా భవన్‌లో జరిగిన కవి సంధ్య స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ సభలో పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. గేయ సాహిత్య విభాగంలో ఈశ్వర్ రెడ్డి చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ఇస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. అనేక సామాజిక సందర్భాలకు ఈయన గేయాలను అందించారు. ఈయన 'మనసు పాట' గేయ సంపుటిలోని దేశభక్తి గీతాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం 12 వ తరగతికి పాఠ్యాంశంగా ఎంపిక అయింది. కడప ద్విశతాబ్ది ఉత్సవాలు, ప్రపంచ తెలుగు మహాసభలు, శ్రీకృష్ణ దేవరాయ పంచ శతాబ్ది పట్టాభిషేక ఉత్సవాలు, గండికోట ఉత్సవాలు తదితర ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రచార, నృత్య గీతాలు రాశారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న అతిథులు

కడప కల్చరల్ : కడప నగరం సబ్ జైలు వద్ద ఉన్న మదరసా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌లో ఆదివారం విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త మొహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం)వారి జీవిత చరిత్రపై రాత పరీక్ష పోటీ విజేతలకు, విద్యార్థులకు ఆదివారం బహుమతులను ప్రదానం చేశారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్ఎం ముక్తార్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సయ్యద్ అజ్మతుల్లా బియబాని, షఫీ, రిటైర్డ్ ఆర్.జె.డి ఏ పిచ్చయ్య చౌదరి, గౌరవ అతిథులుగా జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అడ్వైజరీ సభ్యులు కెఎండి సుభాన్, మద్రసా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ నాజిమ్ ముఫ్తి అబ్దుల్ వదీద్ నదివి, ఆఫ్సర్ ఖాన్ ఫౌండేషన్ డైరెక్టర్ కె ఆఫ్సర్‌ఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండే చదువుతో పాటు ఆధ్యాత్మికాన్ని అలవర్చుకోవాలన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా, ధర్మ పరిచయ కమిటీ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్ బాబు భాయ్ తదిరులు పాల్గొన్నారు.

గాయనిగా 'మహతి'కి మంచి భవిష్యత్తు



మహతిని సత్కరిస్తున్న అన్నమయ్య జిల్లా ఏఎస్పీ, కార్యక్రమ నిర్వాహకులు

కడప కల్చరల్ : లగ్గం సినిమాలో గాయనిగా సినీరంగ ప్రవేశం చేసిన కడపకు చెందిన శ్రీనికా మహతికి సినీ గాయనిగా మంచి భవిష్యత్తు ఉండాలని అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ ఎస్ఆర్ రాజశేఖర్ రాజు ఆకాంక్షించారు. ఆదివారం ఆమెను ఘనంగా సన్మానించారు. జిల్లాకు మంచి పేరు తెచ్చేలా అవకాశాలు అందిపుచ్చుకుని మంచి స్థాయికి చేరాలని ఆశీర్వదించారు. శ్రీ రాజరాజేశ్వరి దేవస్థాన ప్రధాన అర్చకులు, కడప జిల్లా అర్చక పురోహిత సంఘ అధ్యక్షులు పిడతల గోపాలకృష్ణ మాట్లాడుతూ మహతి కడప నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ సురేష్‌బాబు కుమార్తె అని, బాల్యం నుంచి సంగీతం పట్ల ఆమెకు గల శ్రద్ధను గమనించి ఆయన మరింత శిక్షణ ఇప్పించారని తెలిపారు. ఆమె పాడిన లగ్గం సినిమా ఈనెల 25వ తేదిన విడుదలై ఆమె పాటలకు మంచి ఆదరణ లభిస్తుండడం విశేషమన్నారు. కార్యక్రమంలో గోపిస్వామి, అజయ్, చరణ్, పీఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహతి అమ్మవారిపై కీర్తనలు ఆలపించారు.

ఎస్‌బీఐ హోమ్‌లోన్ ఉత్సవ్ విజయవంతం



హోమ్‌లోన్ ఉత్సవ్ మేళాలో పాల్గొన్న కర్నూలు డీజీఎం దినేష్ గులాటీ, ఆర్ఎం శ్రీవాణి కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్/కార్పొరేషన్: స్టేట్ బ్యాంక్ ఇండియా ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు స్థానిక నేకనామ్‌ఖాన్ కళాక్షేత్రంలో నిర్వహించిన హోమ్‌లోన్ ఉత్సవ్, లోన్ మేళా విజయవంతమైందని ఆ బ్యాంకు కర్నూల్ డీజీఎం దినేష్ గులాటీ, కడప రీజనల్ మేనేజర్ శ్రీవాణి కిశోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన మేళాకు వారు హాజరై మీడియాతో మాట్లాడారు. మేళా ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులకు కూడా వ్యక్తిగత, గృహ, వాహన, రుణాలు ఇవ్వనున్నామన్నారు. స్థలం లేదా ఇల్లు కొనేందుకు, సైతం రుణాలు ఇస్తామన్నారు. పెన్షనర్లకు పెన్షన్ రుణాలు, విదేశాలలో చదువుకొనాలనుకునేవారికి విద్యారుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వదేశంలో గుర్తింపు పొందిన కాలేజీలలో చదువుకొనేవారికి కూడా ఎలాంటి సెక్యూరిటీ లేకుండా, గ్యారెంటీ లేకుండా రూ.1.5 కోట్ల వరకూ విద్యా రుణాలు మంజూరు చేస్తామన్నారు. మహిళలకు 0.5 శాతం రాయితీ ఇవ్వడం తమ బ్యాంకు ప్రత్యేకత అన్నారు. పీఎం ముద్ర లోన్లు రూ.10లక్షల వరకూ, పీఎం విశ్వకర్మ లోన్లు, పీఎం స్వనిధి, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక రుణాలు, వ్యవసాయ రుణాలు ఇవ్వనున్నామని, ఆయా వర్గాల ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీఎంలు శ్రీకాంత్‌రెడ్డి, రమణమూర్తి , శ్రీనివాసులరెడ్డి, ఇతర బ్యాంకుల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం బోర్డు పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ బిల్డింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి పేనంపై నుంచి పొయ్యిలో పడినట్లుగా ఉన్నదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక కొరతతో పనులు లేకపోవడం, మరొపక్క కరోనాతో అల్లాడిపోయి ఆకలితో 32 మంది కార్మికులు బలైపోయారన్నారు. రాష్ట్రంలో అనేకమంది అప్పులపాలై ఊరు విడిచి ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లిపోవాల్సి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం గెలిస్తే ఇసుక పాలసీని మారుస్తామని, అందరికీ ఇసుక ఉచితంగా ఇస్తామని, సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి భవన నిర్మాణ కార్మికుల ఆదుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా 50 లక్షల మంది కార్మిక ప్రయోజనాల కోసం ఏర్పడిన సంక్షేమ బోర్డు నిధులు, విధులు, వినియోగం,పై చర్చించి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గం అన్నారు. కొత్త ఇసుక పాలసీని పెట్టారని, అందరికీ ఇసుక ఉచితమే అంటూ ప్రకటించినా ఇసుక ఉచితంగా రావడం లేదన్నారు. రాష్ట్రంలో 110 ఇసుక ర్యాంపులు ఉంటే 76 ర్యాంపులు మాత్రమే ఓపెన్ చేశారని మిగతా 34 రీచ్‌లలో ఎక్కడ ఇసుక స్టాక్ లేక వెలవెల బోతున్నాయన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో మీకు ఇసుక ఇస్తామని చెప్పారు. కానీ 48 గంటలు గడచినా ఆన్‌లైన్ ఓపెన్ కాలేదన్నారు. లారీ ఇసుక రూ.21 వేలు, ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలు వరకు పలుకుతోందన్నారు. నిన్న మొన్నటి వరకు ఇసుక పైన జీఎస్టీ పన్ను, సీనరేజ్, ఇతర ఫీజు వసూలు చేశారన్నారు. ఈ సమస్యలన్నిటిపై రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 11న జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఆందోళనలకు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీ బిల్డింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మద్దిలేటి, లింగన్న బాలాజీ, నాగేశ్వరరావు,రమేష్, మస్తాన్ , వీరేష్ గౌడ్ , రవి, మున్నా, శశి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'దివాళి విత్ మై భారత్'

వైవీయూ: భారత ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ, క్రీడామంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో «దివాళి విత్ మై భారత్» పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. మై భారత్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతు మార్కెట్, సర్వజన ఆసుపత్రి శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కేఎల్ఆర్ మార్ట్ ప్రారంభం



కేఎల్ఆర్ మార్ట్‌ను ప్రారంభిస్తున్న మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అశోక నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన త్రివేణీస్ కేఎల్ఆర్ మార్ట్ రెండో బ్రాంచిని మేయర్ కె. సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది మరియాపురం జూనియర్ కాలేజీ వద్ద చౌటపల్లి రోడ్డులో కేఎల్ఆర్ మార్ట్‌ను ప్రారంభించిన గౌతమ్‌కుమార్ నేడు రెండో బ్రాంచిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వీరు నగరంలో మరిన్ని మార్ట్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్. యానాదయ్య, 12వ డివిజన్ కార్పొరేటర్ సానపురెడ్డి శివకోటిరెడ్డి, 5వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి బండి ప్రసాద్, యల్లారెడ్డి, శివ, శివయ్య, ఓబులయ్య పాల్గొన్నారు.

ఏవీఎస్ రాజు బహుముఖ ప్రజ్ఞకు పట్టం



ఏవీఎస్ రాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : ఏవీఎస్ రాజు కళలకు సంబంధించి పలు విభాగాలలో ప్రజ్ఞ చాటారని, ఆయన బహుముఖ ప్రజ్ఞకు మొల్ల సాహితీపీఠం, భాగ్యరత్న పౌండేషన్ సంస్థలు పట్టం కట్టడం సంతోషించదగిన విషయమని వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం కడప పెన్షనర్స్ కార్యాలయంలో మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం, శ్రీ భాగ్యరత్న పౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఏవీఎస్ రాజుకు రంగస్థలం, సినీ రంగం, ఇతర కళారంగాలలో అభిరుచి ఎక్కువని, సాటి కళాకారులను ఎంతో ఆదరిస్తారని, వారి ఉన్నతికి కృషి చేస్తారని, అందుకే ఆయన కళాకారులకు ఆత్మీయుడయ్యారన్నారు. ఆయన తీసిన పలు లఘు చిత్రాలకు విశేష ప్రశంసలు లభించాయన్నారు. కార్యక్రమ నిర్వాహకులు, మొల్ల పీఠం అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఏవీఎస్ రాజుకు నటకళా రత్న బిరుదును ప్రదానం చేశారు. దీంతో పాటు నగదును అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య, రచయితలు, కళాకారులు, కవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, గానుగపెంట మనోజ్‌కుమార్, మనోహర్, బొమ్మిశెట్టి రమేష్, మధు, పసుపులేటి గోపినాథ్, రాయుడు, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

–పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న



మాట్లాడుతున్న అంకన్న

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజినీరింగ్, బి-ఫార్మసీ వంటి ఉన్నత విద్యకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలో పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు చదువులు కొనసాగించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. రూ.3480 కోట్లు స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమై 1, 3, 5 సెమిస్టర్లకు పరీక్ష ఫీజులు చెల్లించాలని యూనివర్సిటీల నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఇప్పటికే పలు ప్రైవేట్ కళాశాలలో యాజమాన్యాలు పెండింగ్‌లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిళ్లు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ అన్నమయ్య జిల్లా నాయకుడు స్వరూప్ తేజ, కడప నగర నాయకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

• చల్ చల్ గుర్రం..చలాకి గుర్రం





నెహ్రూ పార్క్ వద్ద చిన్నారులను గుర్రంపై కూర్చొబెట్టి స్వారీ చేస్తున్న దృశ్యాలు

కడప నగరంలో ఆదివారం వచ్చిందంటే చాలు ఇండ్లలో చిన్నారులు తల్లిదండ్రులకు ఒకే ఒత్తిడి పార్కులకు పోదాం, ఆడుకుందాం అంటూ మారం చేస్తుంటారు. తల్లిదండ్రులను చిన్నారులు పార్కులలో ఉయ్యాలలో, తాడు ఆట, బంతి ఆట, తో పాటు వాకింగ్ ,సాంస్కృత కార్యక్రమాలు, సంగీత నత్యాలు తోపాటు గుర్రపు స్వారీ తో చిన్నారులు మొగ్గు చూపుతున్నారు, అలాంటి దృశ్యాలే నెహ్రూ పార్క్ వద్ద కనిపించాయి. చల్.. చల్.. గుర్రం.. అంటూ గుర్రపు స్వారి చేస్తూ ఆనందంతో పరుగులు తీస్తున్న దృశ్యాలు సాక్షి కెమెరా బంధించింది.

\- ఎస్.కె మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్ కడప